

తీరానికి గాయం

సముద్రంలో వస్తున్న మార్పుల కారణంగా తీర ప్రాంతం పలు ప్రాంతాల్లో కోతకు గురవుతోంది. 8లో



పింఛన్ల సర్వేపై దుమారం

జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశంలో సామాజిక పింఛన్ల సర్వేపై దుమారం చెలరేగింది. 8లో

అల్లరి నరేష్ సందడి



కొమ్మాది: విశాఖలో సినీ నటుడు అల్లరి నరేష్ బుధవారం సందడి చేశారు. ఓ సినిమా ప్రమోషన్ కోసం విచ్చేసిన ఆయనతో ఫొటోలు తీసుకునేందుకు అభిమానులు ఎగబడ్డారు.

'హ్యాకథాన్' విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి, విశాఖపట్నం : స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించేందుకు ఆ-హబ్, ఈపీడీసీఎల్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన 'హాక్ ఏపీ హ్యాకథాన్'లో సృజనాత్మక ఆవిష్కరణలకు విద్యుత్ పంపిణీ సంస్థ బహుమతులు అందజేసింది. ఆంధ్రా యూనివర్సిటీ వేదికగా బుధవారం జరిగిన 13వ ఎడిషన్ 'హాక్ ఏపీ హ్యాకథాన్' కార్యక్రమంలో స్టార్టప్ సంస్థలతో పాటు విద్యార్థులు, నిపుణులు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలతో సహా 72 బృందాలు పాల్గొన్నాయి. పోటీల్లో భాగంగా విద్యుత్ పంపిణీ వ్యవస్థలోని సమస్యలకు పరిష్కారాలను పలు స్టార్టప్ సంస్థల ప్రతినిధులు ప్రదర్శించారు. విజేతలుగా 7 బృందాల్ని ఎంపిక చేసి రూ.6 లక్షల విలువైన బహుమతులు అందించారు. హ్యాకథాన్‌లో వచ్చిన పరిష్కారాలను అమలుచేయడం ద్వారా సంస్థ సుమారు రూ.2 కోట్లు ఆదా చేయగలుగుతుందని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి తెలిపారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.విశ్వనాథన్ మాట్లాడుతూ విద్య, పారిశ్రామిక రంగాలను అనుసంధానించే దిశగా ఈ తరహా హ్యాకథాన్ల నిర్వహణ ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో ఏపీఈపీడీసీఎల్ డైరెక్టర్లు వి.విజయలలిత, బి.రామచంద్ర ప్రసాద్, సీజీఎం డి.సుమన్ కల్యాణి, ఆ-హబ్ సీఈవో రవి ఈశ్వరపు పాల్గొన్నారు.

14న సాగునీటి సంఘాల ఎన్నిక

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జిల్లాలో సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల కోసం బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈనెల 14న జనరల్ బాడీ సమావేశం నిర్వహించి సాగునీటి వినియోగదారుల సంఘాలకు పాలక వర్గాలను ఎన్నుకుంటారు. విశాఖ జిల్లాలో మొత్తం 29 సాగు నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 19,355 మంది ఓటర్లు ఉన్నారు. మైనర్ ఇరిగేషన్‌లో ఒక్కొక్క సంఘంలో ఆరుగురు సభ్యులను ఎన్నుకుంటారు. ఇందులో ఒక అధ్యక్షుడు, ఒక ఉపాధ్యక్షుడు, నలుగురు సభ్యులు ఉంటారు.

టీడీపీ సభ్యులకు కౌంటర్ ఇస్తున్న జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కటుమూరి సతీష్





కార్మికుల వేతనాల పెంపుపై తలొగ్గిన టీడీపీ

- 67 అంశాలపై విస్తృతంగా చర్చ
- వాడీవేడిగా జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం

దాబాగార్డెన్స్: జీవీఎంసీ కౌన్సిల్ సమావేశంలో టీడీపీ తలొగ్గింది. వైఎస్సార్ సీపీ, వామపక్ష పార్టీలతో పాటు జనసేన, బీజేపీ సభ్యులు కార్మికుల వేతనాల పెంపు అంశంపై ఆమోదం తెలపడంతో.. చివరకు టీడీపీ సభ్యులు తలొగ్గి ఆ అంశాన్ని ఆమోదించారు. అంత వరకు ఆ అంశాన్ని వాయిదా వేయండని ఒకరు.. అధికారులే నిర్ణయాలు తీసుకుంటే మేమెందుకని మరొకరు.. ఈ అంశాన్ని ప్రస్తుతానికి వాయిదా వేసి చర్చించిన తర్వాత ప్రభుత్వానికి పంపాలని ఇంకొకరు.. ఇలా టీడీపీ సభ్యులు ఒక్కొక్కరూ ఒక్కో విధంగా స్పందించారు.

జీవీఎంసీ సర్వసభ్య సమావేశం బుధవారం కౌన్సిల్ హాలులో మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధ్యక్షతన జరిగింది. 46 అజెండా, 21 సప్లిమెంటరీ అంశాలు సభ్యుల చర్చకు వచ్చాయి. వీటిలో 60 అంశాలను సభ్యులు ఆమోదించగా.. 2 వాయిదా వేశారు. మూడు రద్దు చేసి, రెండు తిరస్కరించారు. నగర పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో అధికారులు ప్రోటోకాల్ పాటించడం లేదని డిప్యూటీ మేయర్ కె.సతీష్ అన్నారు. ప్రోటోకాల్ పాటించేలా అధికారులు చర్యలు చేపట్టాలని మేయర్ ఆదేశించారు.

కార్మికుల వేతన పెంపుపై విస్తృత చర్చ

నీటి సరఫరా విభాగం కార్మికులు, వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, టర్న్‌కాక్స్, బోర్ మెకానిక్స్, ఫిట్టర్/ఎలక్ట్రికల్ హెల్పర్లకు అర్హత, అనుభవం, కేటగిరీ ఆధారంగా వేతనాలు పెంచాలని కొంతకాలంగా యూనియన్లు డిమాండ్ చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో జీవో 7 ప్రకారం స్కిల్డ్, అన్‌స్కిల్డ్ వర్గీకరణ ఆధారంగా వేతనాలు చెల్లించాలనే ప్రతిపాదనపై దాదాపు గంట పాటు చర్చ జరిగింది. ఈ అంశంపై కొందరు టీడీపీ కార్పొరేటర్లు మాట్లాడుతూ 2019–23 వరకు ఎంత మందిని తీసుకున్నారు? ఎలా నియమించారు? దీనిపై ప్రత్యేక కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. అధికారులే నిర్ణయాలు తీసుకుని నేరుగా నియమించుకుంటున్నారని.. అలాంటప్పుడు గౌరవ సభ్యులుగా తామెందుకని మరికొందరు ఎస్ఈని ప్రశ్నించారు. ఈ అంశంపై విస్తృత చర్చ అనంతరం టీడీపీ తప్ప అన్ని పార్టీలు ఆమోదం తెలిపాయి. చివరకు చేసేదేమీ లేక టీడీపీ కార్పొరేటర్లు ఆమోదించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఈ అంశాన్ని ఆమోదిస్తున్నామని.. సభ్యులు లేవనెత్తిన 169 మంది కార్మికులకు సంబంధించి పూర్తి విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

త్వరలో నోటిఫికేషన్

- జీవీఎంసీ లీగల్ విభాగానికి సంబంధించి 8 జోన్లలో పనిచేస్తున్న మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులు పదవీకాలం కొనసాగించే విషయమై వచ్చిన అంశాన్ని సభ్యులు తిరస్కరించారు. దీనిపై మేయర్ మాట్లాడుతూ సభ్యుల సూచన మేరకు ఈ అంశాన్ని రద్దు చేసినట్లు వెల్లడించారు. నూతన స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుల నియామకానికి సంబంధించి త్వరలోనే నోటిఫికేషన్ ఇచ్చేందుకు ఆమోదం తెలిపారు.
- ముడసర్లోవ పార్కులో గుర్రపు స్వారీ బరిని అభివృద్ధి పరిచి ఏడేళ్లు నిర్వహించేందుకు వచ్చిన అంశాన్ని సభ్యులు తిరస్కరించారు. గుర్రాల పార్కు అవసరం లేదని, ఈ స్థలాన్ని ప్రజా అవసరాలకు ఉపయోగించాలని సభ్యులు సూచించారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు ఇచ్చిన మొత్తాన్ని రికవరీ చేయాలన్నారు.

ప్రభుత్వం దృష్టికి పలు అంశాలు

- మాస్టర్ ప్లాన్ ప్రకారం ఎండాడ, రుషికొండ, కొమ్మాది గ్రామాల్లో 100 అడుగుల రోడ్డుగా వరకు విస్తరించాలనే ప్రతిపాదనకు టీడీఆర్ సర్టిఫికెట్ల విషయంలో తలెత్తుతున్న అభ్యంతరాలు భూసేకరణ ప్రక్రియకు ఆటంకం కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం భూ సేకరణకు సంబంధించిన 2013 నాటి చట్టం (భూసేకరణ, పునరావాసం,పునరావాస చట్టం)ప్రకారం చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. అలాగే రోడ్ల విస్తరణలో స్థలం కోల్పోయిన యజమానులకు నష్టపరిహారం చెల్లించే అంశాన్ని సభ్యులు సుదీర్ఘంగా చర్చించారు. సింహాచలం రోడ్డు విస్తరణ వల్ల ఇళ్లు కోల్పోయిన వారికి టీడీఆర్‌లు జారీ చేయాలని పలువురు సభ్యులు కోరారు. దీంతో ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని మేయర్ ప్రకటించారు
- 2005లో తాటిచెట్లపాలెంలో 84 సెంట్ల భూమిని గృహ నిర్మాణ శాఖకు ఇచ్చిన వారికి ప్రత్యామ్నాయంగా ముడసర్లోవలో 1.54 సెంట్ల భూమిని ఇవ్వడానికి అనుమతి కోరుతూ వచ్చిన అంశాన్ని సభ్యులు తిరస్కరించారు. వాస్తవానికి అవి మిగులు భూములని, ఆ స్థలాన్ని 2005లోనే వారు చారిటబుల్ ట్రస్ట్‌కు గిఫ్ట్ డీడ్ చేసేశారని, అంతేగాక వారికి ఇళ్లు కూడా ఇచ్చేశారని పలువురు సభ్యులు కౌన్సిల్ ముందుకు తీసుకొచ్చారు. దీనిపై కమిషనర్ సంపత్‌కుమార్ స్పందిస్తూ ఈ అంశాన్ని ప్రభుత్వానికి పంపనున్నట్టు చెప్పారు.

టీడీఆర్‌ల జారీపై రభస

2014 నుంచి 2024 వరకు జారీ చేసిన టీడీఆర్‌లపై సమగ్రంగా విచారించి చర్యలు చేపట్టాలని పలువురు సభ్యులు కోరారు. ఇప్పటి వరకు వందల కోట్ల విలువ చేసిన 1035 టీడీఆర్‌లు ఏ ప్రాతిపదికన జారీ చేశారో తెలపాలని, వీటిలో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగిందని ఆరోపించారు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని తెలిపారు. ఏ టీడీఆర్‌పై అనుమానం ఉందో తెలిపితే వాటిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

వాయిదా వేసిన అంశాలివీ

- **జీవీఎంసీకి చెందిన** వివిధ క్రీడా ప్రాంగణాల్లో **సభ్యత్వ రుసుం**లు, అద్దెలు, ఇతర **రుసుంలు సవరించే** ప్రతిపాదన అంశాన్ని **సభ్యులు వాయిదా వేశా**రు. జీవీఎంసీకి చెందిన **స్వర్ణభారతి ఇండో**ర్ స్టేడియం, బీచ్ **స్పోర్ట్స్ కాంప్లెక్స్, త్రీటౌ**న్ పోలీస్ స్టేషన్ సమీ**పంలోని లాన్ టెన్నిస్** స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇం**దిరా ప్రియదర్శిని మున్సి**పల్ స్టేడియం, ఎం**వీపీ కాలనీలోని రాజీవ్** ఇండోర్ జిమ్నాజియం**, గాజువాకలోని రాజీవ్** క్రీడా ప్రాంగణం, శ్రీరా**జరాజేశ్వరి కళా క్షేత్రం,** మల్కాపురం క్రీడా **ప్రాంగణం, అనకాపల్లి** ఎన్టీఆర్ స్టేడియం, **రాజీవ్‌గాంధీ ఇండోర్** స్టేడియం, భీమునిపట్నంలోని మున్సిపల్ ఇండోర్ స్టేడియం, మున్సిపల్ గ్రౌండ్‌ను ప్రైవేట్ వ్యక్తులకు ఇవ్వకుండా.. జీవీఎంసీ ఆధ్వర్యంలోనే నడిచేలా చూడాలని పలువురు సభ్యులు కోరారు. ఈ అంశంపై పూర్తిగా అధ్యయనం చేయాలన్నారు. దీంతో మేయర్ ఈ అంశాన్ని వాయిదా వేశారు.
- జోన్-1 పరిధిలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న డి.వెంకట్రావు స్వచ్ఛంద పదవీ విరమణకు చేసుకున్న దరఖాస్తుపై సభ్యులు స్పందించారు. ఈ అంశాన్ని స్థాయీ సంఘ సభ్యులు రెండు సార్లు వాయిదా వేశారని, అతనిపై వస్తున్న ఆరోపణలపై చర్చించాలని పలువురు సభ్యులు కోరారు. దీంతో మేయర్ ఈ అంశాన్ని వాయిదా వేశారు.

స్థానిక సమస్యలపై ...

- గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ జీవీఎంసీకి చెందిన భవనాల నిర్మాణ జీవితకాలం పరిశీలించకుండా వాటిని కూల్చివేసి, కొత్త భవనాలు నిర్మించడం సరైనది కాదన్నారు. మంచి స్థితిలో ఉన్న భవనాలను కూల్చివేయడంపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆర్థిక వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల అమలులో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలన్నారు.
- వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ జ్ఞానాపురం హోల్‌సేల్ మార్కెట్ చాలా చిన్నదిగా ఉండటం వల్ల వ్యాపారులు, కొనుగోలుదారులు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యకు పరిష్కారంగా ఆరిలోవ ప్రాంతంలో 10 ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. నైట్ షెల్టర్లపై విచారణ చేపట్టాలన్నారు.

15న వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయం ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అమర్‌నాథ్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి తదితరులు

సాక్షి, విశాఖపట్నం: మద్దిలపాలెం కృష్ణా కళాశాల సమీపంలో గల వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయాన్ని ఈ నెల 15వ తేదీన శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్, పార్టీ నేతలు చింతలపూడి వెంకట్రామయ్య, రవిరెడ్డి, కొండా రాజీవ్‌గాంధీ, పేర్ల విజయచందర్, పేడాడ రమణకుమారి, మొల్లి అప్పారావు, బోని శివరామకృష్ణ, అల్లంపల్లి రాజుబాబు, పి.సుజాత, బి.పద్మావతి, మారుతి ప్రసాద్, ద్రోణంరాజు శ్రీవాత్సవ్, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, భర్కత్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విశాఖ ఆర్గానిక్ మేళా

15 వరకు ఏయూ మైదానంలో నిర్వహణ



ఆర్గానిక్ మేళా ర్యాలీలో పాల్గొన్న నగరవాసులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో గురువారం నుంచి ఆదివారం(15వ తేదీ) వరకు విశాఖ ఆర్గానిక్ మేళా నిర్వహించనున్నట్లు శాసన మండలి పూర్వ సభ్యులు పీవీఎన్ మాధవ్ తెలిపారు. సాగరతీరంలోని ఆర్కే బీచ్‌లో ఆర్గానిక్ మేళాపై ప్రచార కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం, ఏపీ రైతు సాధికార సంస్థ నేతృత్వంలో జరిగే ఈ ఆర్గానిక్ మేళాను నగరవాసులు ఆదరించాలని కోరారు. 50 మంది రైతులు, ఆదివాసీలు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దాట్ల సుబ్రహ్మణ్యవర్మ మాట్లాడుతూ ఈ మేళాలో 12న రైతుల సమ్మేళనం, 13న మీ ఆరోగ్యం మీ చేతిలో, 14న ఫుడ్ ప్రాసెసింగ్, 15న మిద్దె తోటల పెంపకం కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాలెం నేచురల్స్ అశోక్, సత్వ నేచురల్స్ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జైలులో పటిష్టమైన రక్షణకు చర్యలు

సూపరింటెండెంట్ మహేష్‌బాబు



ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో పటిష్టమైన రక్షణ కోసం చర్యలు చేపడుతున్నామని సూపరింటెండెంట్(ఎఫ్ఏసీ) ఎం.మహేష్‌బాబు తెలిపారు. నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి బదిలీపై వచ్చిన ఆయన ఇటీవల బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. కొంత కాలంగా ఈ కారాగారంలో చోటు చేసుకున్న సంఘటనలతో ఇద్దరు ఉన్నతాధికారులపై బదిలీ, సస్పెన్షన్ వేటు పడింది. ఖాళీ అయిన సూపరింటెండెంట్ పోస్టులో మహేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ తనతో పాటు మరో ఇద్దరు డిప్యూటీ సూపరింటెండెంట్లు కొత్తగా విధుల్లో చేరినట్లు తెలిపారు. సిబ్బంది సహకారంతో జైల్‌లో పూర్తిస్థాయి భద్రతా చర్యల కోసం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కొత్త డీఎస్‌లు బాధ్యతల స్వీకరణ

సెంట్రల్ జైల్‌లో కొత్త డిప్యూటీ సూపరింటెండెంట్లు (డీఎస్) కొలువుదీరారు. గతంలో ఇక్కడ ఇద్దరు డీఎస్‌లు మాత్రమే విధులు నిర్వహించేవారు. వారిలో ఓ డీఎస్ గత నెలలో ఉద్యోగ విరమణ పొందడంతో ఒక్కరే మిగిలారు. కొత్తగా ఇద్దరు డీఎస్‌ల రాకతో, వారి సంఖ్య మూడుకు చేరింది. నెల్లూరు కేంద్ర కారాగారం నుంచి బదిలీపై వచ్చిన ఎన్.సాయిప్రవీణ్ వారం రోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. మరో కొత్త డీఎస్‌గా 2023 బ్యాచ్‌కు చెందిన సీహెచ్ సూర్యకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజమండ్రి కేంద్ర కారాగారంలో శిక్షణ పూర్తి చేసుకుని మొదటి పోస్టింగ్‌గా ఆయన విశాఖకు వచ్చారు.

కలెక్టర్ల సదస్సుకు హాజరైన హరేందిర ప్రసాద్



మహారాణిపేట: వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో బుధవారం నిర్వహించిన కలెక్టర్ల సదస్సులో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పాల్గొన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులు, పథకాల అమలు గురించి వివరించారు.

రేపటి నుంచి శిల్పారామంలో చేనేత వస్త్ర ప్రదర్శన

మహారాణిపేట: మధురవాడలోని శిల్పారామంలో ఈ నెల 13 నుంచి 26వ తేదీ వరకు హాథ్ కర్గ పేరుతో చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు ఏపీ శిల్పారామం సొసైటీ సీఈవో వి.స్వామినాయుడు తెలిపారు. భారత ప్రభుత్వ అభివృద్ధి కమిషనర్ సౌజన్యంతో నిర్వహిస్తున్న ఈ మేళాలో వివిధ రాష్ట్రాలకు చెందిన చేనేత వస్త్ర కార్మికులు తమ ఉత్పత్తులను విక్రయిస్తారన్నారు.



అట్ట.. బంతి.. పికిల్‌బాల్

- అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన క్రీడ
- అన్ని వయసుల వారు సులభంగా ఆడుకోవచ్చు
- నగరంలో అందుబాటులోకి వచ్చిన కోర్టులు


ఆటను తిలకిస్తున్న మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ

విశాఖ స్పోర్ట్స్: ఆటలు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కొంత ఒత్తిడిని కూడా పెంచుతాయి. అయితే ఒత్తిడి లేకుండా ఉల్లాసంగా ఆడుకునే క్రీడగా ఇటీవల కాలంలో అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందిన క్రీడ పికిల్‌బాల్. చిన్నప్పుడు అట్టతో ప్లాస్టిక్ బంతిని కొడుతూ అటు ఇటు ఆడుకునే ఆటకు ఆధునిక వెర్షనే ఈ పికిల్‌బాల్. టెన్నిస్ ఆడాలంటే పెద్ద కోర్టుతో పాటు ఎక్కువ స్టామినా, పవర్ కావాలి. ఇది పూర్తిగా ఔట్‌డోర్ క్రీడ. ఇక టేబుల్ టెన్నిస్ రాకెట్‌తో ఆడతారు. చిన్న బంతి ఉంటుంది. ఇది పూర్తిగా ఇండోర్ గేమ్. ఈ రెండు రాకెట్ గేమ్ ఆటలను సమన్వయం చేస్తూ.. బ్యాడ్మింటన్ కోర్టు మాదిరిగా ఉండే కోర్టులో ఆడే క్రీడే ఈ పికిల్‌బాల్. ఈ క్రీడను అటు ఇండోర్‌లోనూ.. ఇటు ఔట్‌డోర్‌లోనూ ఎలాంటి ఒత్తిడి లేకుండా.. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు ఎవరైనా ఆడవచ్చు. అందుకే ఈ క్రీడ ప్రస్తుతం అంతర్జాతీయంగా ప్రాచుర్యం పొందుతోంది.

ఆడేది ఇలా...

20×40 అడుగుల విస్తీర్ణంలోని కోర్టును నెట్ రెండు సమాన భాగాలుగా విభజిస్తుంది. నెట్ భూమి నుంచి 34 అంగుళాల ఎత్తులోనే ఉంటుంది. 17 అంగుళాల పొడవు చెక్కతో చేసిన బ్యాట్‌ను పాడిల్ అంటారు. బాల్ వ్యాసం సైతం 2.87 అంగుళాలే. బ్యాడ్మింటన్ మాదిరిగానే క్రాస్ కోర్టులో పడే విధంగా బంతిని ఆడతారు. సర్వీస్ అండర్ హ్యాండ్ స్ట్రోక్‌తోనే ప్రారంభమవుతుంది. సర్వీస్ చేసిన వారికే పాయింట్ వస్తుంది. లేకుంటే సర్వీస్ మారుతుంది. సరదాగా ఆడితే 11 పాయింట్లు, టోర్నీల్లో అయితే 15–21 పాయింట్లు. విజయానికి రెండు పాయింట్ల తేడా సరిపోతుంది.

ఆసక్తి ఎందుకంటే.?

సింగిల్స్‌తో పాటు జట్టుగా ఆడేందుకు వీలుగా పికిల్ బాల్ క్రీడను రూపొందించారు. ఈ ఆటలో సరళమైన నియమాలు ఉంటాయి. నేర్చుకోవడం చాలా సులభం. ఈ క్రీడలో గాయాల అవకాశం తక్కువగా ఉండటంతో విశ్రాంత ఆటగాళ్లు దీని వైపు ఆకర్షితులవుతున్నారు. టెన్నిస్ నెట్ మాదిరిగానే ఉండటంతో ఒత్తిడి లేదు. ప్లాస్టిక్‌తో తయారు చేసిన బంతి కావడంతో సర్వీస్ చేయడం కూడా సులభం. టేబుల్ టెన్నిస్ లాగే బంతి తమ కోర్టులో పడిన తర్వాతే ఆడాలి కాబట్టి అధిక ఒత్తిడి ఉండదు. చెక్కతో తయారైన రాకెట్ కాస్త పెద్దగా ఉండటంతో పిల్లలు కూడా సులభంగా ఆడగలరు. కుటుంబం, స్నేహితులతో కలిసి ఆడటానికి అనువైన ఆట. శారీరక శ్రమ, మానసిక ప్రశాంతత, సామాజిక పరస్పర చర్యలకు ఈ క్రీడ దోహదం చేస్తుంది. ఈ కారణాల వల్ల పికిల్ బాల్ చాలా మందికి ఇష్టమైన క్రీడగా మారుతోంది.

ఒత్తిడి లేని క్రీడ



చిన్నారుల నుంచి పెద్దవారు వరకు ఈ ఆట ఆడుకునే అవకాశం ఉంది. కీళ్ల నొప్పులు ఉన్నవారు సైతం టోర్నీలో పాల్గొనేంత సులభంగా ఆట సాగుతుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ప్రజాదరణ పొందుతున్న ఆధునిక క్రీడ. తక్కువ స్థలంలో ఆడగలిగే ఈ క్రీడ.. అన్ని వయసుల వారికి ఆనందాన్నిస్తుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో నాలుగు కోర్టులను ఏర్పాటు చేశాం. టోర్నీలు నిర్వహించుకునేందుకు అవసరమైన వసతులను సమకూర్చాం. పికిల్‌బాల్ టోర్నీలకు విశాఖ త్వరలోనే కేంద్రంగా మారనుంది.

– డాక్టర్ సందీప్, పికిల్‌బాల్ హబ్ అధినేత

పికిల్‌బాల్ హబ్ ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: అంతర్జాతీయ ప్రమాణాలతో.. టోర్నీలు నిర్వహించే స్థాయిలో పికిల్ బాల్ హబ్ విశాఖలో అందుబాటులోకి వచ్చింది. 7,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో నాలుగు ఆధునిక కోర్టులతో పాటు ఆటగాళ్లకు అన్ని వసతులు కల్పించేలా సాగరతీరంలో తీర్చిదిద్దిన ఈ క్రీడాప్రాంగణాన్ని బుధవారం మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ ప్రారంభించారు. క్రీడా ప్రాంగణం అధినేత డాక్టర్ సందీప్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ తరహా క్రీడాప్రాంగణం తొలిసారిగా విశాఖలోనే ఏర్పాటు చేశామన్నారు.

అడ్డగోలుగా నియమించేస్తారా?

- కూటమి నేతల సిఫార్సుతో అక్రమ డిప్యూటేషన్లు
- సమగ్ర శిక్షలో పోస్టుల అమ్మకాలు?
- ఉపాధ్యాయులకు బోధనేతర పనులు
- కమాండ్ కంట్రోల్ రూమ్‌కు తాళాలు
- నాడు అక్రమం.. నేడు సక్రమమా..!


జిల్లా విద్యాశాఖ కార్యాలయం

విశాఖ విద్య: జిల్లా విద్యాశాఖలో వింత పోకడలు కొనసాగుతున్నాయి. బడిలో పాఠాలు చెప్పాల్సిన ఉపాధ్యాయులను కార్యాలయాలకు తీసుకొచ్చి కూర్చోబెడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చీ రాగానే డిప్యూటేషన్లన్నీ రద్దు చేసింది. కానీ కూటమి నేతల సిఫార్సులతో తాజాగా జిల్లా విద్యాశాఖాధికారులు డిప్యూటేషన్లకు తెరలేపారు. ఇలాంటి చర్యలు అక్రమమని నాడు గొంతెత్తి నిలదీసిన కూటమి నేతలు.. నేడు అధికారంలోకి రాగానే అదే పంథాను కొనసాగిస్తుండటంలో ఆంతర్యమేమిటని ఉపాధ్యాయులు, విద్యావేత్తలు ప్రశ్నిస్తున్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు అప్పగించవద్దని ఇటీవల విద్యాశాఖ డైరెక్టరేట్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కానీ జిల్లాలో ఇందుకు విరుద్ధంగా నియామకాలు జరుగుతుండటం సర్వత్రా విమర్శలకు తావిస్తోంది.

సీఎంవో నియామకంపై అభ్యంతరం

విద్యాశాఖలో తాజాగా జరుగుతున్న నియామకాలు, డిప్యూటేషన్లు తీవ్ర దుమారం లేపుతున్నాయి. సమగ్ర శిక్ష సీఎంవో పోస్టులో చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఓ స్కూల్ అసిస్టెంట్‌ను నియమించారు. ఎటువంటి ముందస్తు నోటిఫికేషన్ లేకుండా భర్తీ చేయడంపై ఉపాధ్యాయులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సమగ్ర శిక్షలో పర్యవేక్షణ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలి. తర్వాత కలెక్టర్ నేతృత్వంలోని జిల్లా కమిటీ పూర్తి స్థాయి పరిశీలన చేసిన తర్వాత భర్తీ చేయాలి. కానీ ఇవేమీ లేకుండానే సమగ్రశిక్షలో పోస్టులు భర్తీ దేనికి సంకేతమని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు.

డీఈవో కార్యాలయంలో బోధనేతర పనులకు వినియోగిస్తున్న ఉపాధ్యాయులను వెంటనే స్కూళ్లకు పంపించేయాలని యూటీఎఫ్, ఏపీటీఎఫ్ వంటి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

పోస్టులకు బేరం పెట్టారా?

సమగ్ర శిక్ష కార్యాలయంలో పర్యవేక్షణాధికారుల పోస్టులకు కూటమి నేతలు బేరం పెట్టారనే ప్రచారం సాగుతోంది. విద్యాశాఖ కార్యకలాపాల నిర్వహణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఏటా జిల్లాకు రూ.100 కోట్ల వరకు బడ్జెట్ కేటాయిస్తారు. సమగ్ర శిక్ష ద్వారానే ఈ నిధులు ఖర్చు చేస్తుంటారు. అందుకనే ఇక్కడ మానిటరింగ్ అధికారులుగా డిప్యూటేషన్‌పై పనిచేసేందుకు కూటమి నేతలతో సిఫార్సు చేయించుకుంటున్నారనే ప్రచారం జరుగుతోంది. సీఎంవో, ఏఎంవో, జీసీడీవో, ఏఎల్ఎస్వో, ఐఈఆర్టీ వంటి పోస్టులకు యమ డిమాండ్ ఉంటోంది. తాజాగా సీఎంవో పోస్టును డిప్యూటేషన్‌పై భర్తీ చేశారు. దీంతో జిల్లా సమగ్ర శిక్షలో ప్రస్తుతం పనిచేస్తున్న వారిని తప్పించి ఆ పోస్టుల్లోకి వచ్చేందుకు మరికొంతమంది టీచర్లు కూటమి నేతల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు సమాచారం.

కమాండ్ కంట్రోల్ సెంటర్ మూత

భీమునిపట్నం కేంద్రంగా పని చేస్తున్న 'కమాండ్ కంట్రోల్ సెంటర్'కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత తాళాలు వేశారు. విద్యాశాఖలో అమలు చేసే సంక్షేమ పథకాలు, కార్యక్రమాల అమలు, డేటా సేకరణ, పర్యవేక్షణ ఇక్కడ నుంచే చేసేవారు. వేర్వేరు స్కూళ్ల నుంచి ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై ఇక్కడ నియమించారు. రాష్ట్రంలో విజయవాడ, విశాఖపట్నం(భీమునిపట్నం)లో మాత్రమే ఇలాంటి సెంటర్లు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉపాధ్యాయులను బోధనేతర పనులకు వినియోగించడానికి వీల్లేదని హడావిడి చేస్తూ.. డిప్యూటేషన్లు రద్దు చేసింది. దీంతో కమాండ్ కంట్రోల్ సెంటర్ మూతపడింది. ఇలా వెనక్కి పంపించిన ఉపాధ్యాయుల్లో ముగ్గురు తిరిగి డీఈవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండటం గమ్మత్తైన విషయం. వీరికి డిప్యూటేషన్ వేశారా? లేదా అనధికారికంగా విధులు నిర్వహిస్తున్నారా? అనే దానిపై ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆరా తీసే పనిలో పడ్డారు.

బెంగళూరు-హౌరా మధ్య వన్ వే స్పెషల్



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా మధ్య వన్‌వే స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఎస్ఎంవీ బెంగళూరు-హౌరా(08565) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఎస్ఎంవీ బెంగళూరులో ఈ నెల 14వ తేదీన (శనివారం) ఉదయం 10.15 గంటలకు బయల్దేరి మరునటిరోజు తెల్లవారు 4.03 గంటలకు దువ్వాడకు, ఆదివారం రాత్రి 9.45 గంటలకు హౌరా చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు జోలార్‌పేట, కాట్పాడి, రేణిగుంట, గూడూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం, శ్రీకాకుళం రోడ్ పలాస, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్ భువనేశ్వర్, కటక్, భద్రక్, బాలాసోర్, ఖరగ్‌పూర్‌లలో ఆగుతుంది.

పలు రైళ్ల రద్దు

సంబల్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతాపరమైన ఆధునీకీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో నడిచే పలు రైళ్ల ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖపట్నం-రాయ్‌పూర్ (08528) పాసింజర్ స్పెషల్ జనవరి 2 నుంచి 8వ తేదీ వరకు, రాయ్‌పూర్-విశాఖపట్నం(08527) పాసింజర్ స్పెషల్ జనవరి 3 నుంచి 9వ తేదీ వరకు, విశాఖపట్నం-భవానిపట్నం(08504) పాసింజర్ స్పెషల్ జనవరి 3 నుంచి 8వ తేదీ వరకు, భవానిపట్నం-విశాఖపట్నం(08503) పాసింజర్ స్పెషల్ జనవరి 4 నుంచి 9వ తేదీ వరకు, విశాఖపట్నం-దుర్గ్ (18530) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ జనవరి 3 నుంచి 8వ తేదీ వరకు, దుర్గ్-విశాఖపట్నం(18529) ఇంటర్‌సిటి ఎక్స్‌ప్రెస్ జనవరి 3 నుంచి 8వ తేదీ వరకు రద్దయినట్లు పేర్కొన్నారు.

పింఛన్ల సర్వేపై దుమారం

- పింఛన్లు తొలగిస్తారన్న భయం ఉందన్న జెడ్పీటీసీలు
- ప్రొటోకాల్ పాటించడం లేదని సభ్యుల ఆవేదన


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ

మహారాణిపేట: సామాజిక పింఛన్ల సర్వేపై జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశంలో దుమారం చెలరేగింది. బుధవారం జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన స్థాయీ సంఘాల సమావేశాలు జరిగాయి. పింఛన్ల సర్వేపై ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోందని.. పింఛన్లు తొలగిస్తారన్న భయం నెలకొందని.. దీనిపై అపోహలు నివృత్తి చేయాలని దేవరాపల్లి జెడ్పీటీసీ కర్రి సత్యం కోరారు. దీనిపై జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర వివరణ కోరగా.. విశాఖ జిల్లా డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు పింఛన్లపై సర్వే జరుగుతోందన్నారు. పింఛన్లు తొలగించమని ఆదేశాలు జారీ లేవని, సర్వే నివేదిక కూడా ప్రభుత్వానికి పంపామన్నారు.

ప్రొటోకాల్‌పై రగడ

ప్రొటోకాల్‌పై కొంత మంది జెడ్పీటీసీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో జరిగే కార్యక్రమాలకు జెడ్పీటీసీ సభ్యులకు ఆహ్వానాలు ఉండడం లేదని, శిలాఫలకాలపై పేర్లు వేయడం లేదని వాపోయారు. మునగపాక జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట సామ సత్యనారాయణ మాట్లాడుతూ ఇటీవల తమ మండలంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలకు జరిగాయని, తనను ఆహ్వానించలేదన్నారు. అంగన్‌వాడీ పోస్టుల భర్తీలో నిబంధనలు పాటించడం లేదని, అర్హత గల వారికి ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు. కె.కోటపాడు మండలంలో ఇటీవల జరిగిన కార్యక్రమాలకు తమకు ఎలాంటి ఆహ్వానం లేదని జెడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధ అన్నారు.

సదరం జాప్యంపై ఆందోళన

సదరం సర్టిఫికెట్లు అర్హులకు అందడం లేదని, స్లాట్‌ల కోసం దివ్యాంగులు పలుమార్లు తిరగాల్సి వస్తోందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ సదరం స్లాట్‌లు దొరకకపోవడంలో దివ్యాంగులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సదరం మెగా క్యాంప్ నిర్వహించి సర్టిఫికెట్లు జారీ చేయాలని కోరారు.

రాత్రులు వైద్యులు ఎక్కడ?

ప్రభుత్వ ఆస్పత్రులు, పీహెచ్‌సీ, సీహెచ్‌సీల్లో రాత్రుల సమయంలో వైద్యులు లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ఆస్పత్రుల్లో డ్యూటీ సమయంలో కూడా వైద్యులు అందుబాటులో ఉండడం లేదని, దీంతో రోగులను కేజీహెచ్‌కు తరలించాల్సి వస్తోందని కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనురాధ అన్నారు. గతంలో ఫోన్ చేస్తే 108 వాహనాలు వచ్చేవని, ఇప్పుడు ఫోన్ చేసినా వచ్చే పరిస్థితి ఉండడం లేదని సభ్యులు ప్రశ్నించారు. జిల్లాలోని పలు పాఠశాలల్లో మరుగుదొడ్ల దుస్థితి దారుణంగా ఉందని జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర, ఇతర సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

తీర్మానం

ప్రతి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ కార్యక్రమాలు, సమావేశాలకు స్థానిక జెడ్పీటీసీ, ఎంపీటీసీలను ఆహ్వానించాలని జిల్లా పరిషత్‌లో ఒక తీర్మానం చేయనున్నట్టు జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర తెలిపారు. ఈ తీర్మానాన్ని ప్రభుత్వానికి కూడా పంపనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తీరానికి గాయం


విక్టరీ ఎట్ సీ ఎదురుగా కోతకు గురైన తీరం


కూలడానికి సిద్ధంగా ఉన్న రక్షణ గోడ

ఏయూక్యాంపస్: సముద్ర తీరానికి తీరని గాయం ఏర్పడుతోంది. సముద్రంలో వస్తున్న మార్పుల కారణంగా తీర ప్రాంతం పలు ప్రాంతాల్లో కోతకు గురవుతోంది. గతంతో పోల్చితే ఈ సమస్య ఇటీవల కాలంలో ఎక్కువైంది. ప్రధానంగా విక్టరీ ఎట్ సీ వద్ద సముద్ర కెరటాలు ఉధృతంగా తీరానికి తాకుతున్నాయి. దీంతో దాదాపు మూడు అడుగుల లోతుకు ఇసుక కోతకు గురైంది. పర్యాటకులు ఈ ప్రాంతంలో బీచ్‌లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. కోస్టల్ బ్యాటరీ, ఆర్‌కే బీచ్, నోవాటెల్ హోటల్ ఎదురుగా ఇదే పరిస్థితి నెలకొంది. దీంతో తీరప్రాంతంలోని ఇసుక కోతకు గురవుతోంది. నోవాటెల్ ఎదురుగా ఉన్న పార్క్ రక్షణ గోడ కూలిపోయే ప్రమాదంలో ఉంది. ఇంతటి ప్రమాదకర పరిస్థితులు ఉన్నప్పటికీ పలువురు పర్యాటకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. లోతుగా ఉన్న ప్రాంతంలో దిగుతూ స్నానాలు చేస్తున్నారు. మరికొందరు కూలేందుకు సిద్ధంగా ఉన్న గోడపై కూర్చొని ఫొటోలు తీసుకుంటున్నారు. సముద్ర కోతను తీవ్రంగా పరిగణిస్తున్న నిపుణులు.. ఈ సమస్యను అదుపు చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.


ఆర్‌కే బీచ్ వద్ద కోతకు గురైన సముద్ర తీరం

విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణలో భాగస్వామ్యం కావాలి

మహారాణిపేట: విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియం వేదికగా ఈనెల 13న ముఖ్యమంత్రి చేతుల మీదుగా జరగనున్న స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ మహోత్సవంలో జిల్లాకు చెందిన పారిశ్రామికవేత్తలు, రైతులు, సామాజిక కార్యకర్తలు భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా నుంచి బయలుదేరే వారి సౌకర్యార్థం తగిన వాహనాలను సమకూర్చాలన్నారు. వివిధ రంగాలకు చెందిన సుమారు 300 మందిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.